


నా కనుగొనలు,
నా ఎదకోనలు,
నా మన [illegible] వాహినులారా..
వాహినుల లాలించు వాణులారా...
వాణులారా...
వాహినులారా...
ఝన ఝన ఝన ఝన
ఝన ఝన మంటి
నా గతి ఏకతే నా లయకలా,
నా యతి పోలిన నా గణులారా,
నా గతులా...
నా గణులారా...
ఇరవై కాలాలు,
పదవై కావ్యాలు,
ప్రారంభించి కల్పిస్తావా?
కాలమై కవనం,
కావ్యమై కవనం,
కల్పించి కల్పిస్తావా?

Property of www.eemaata.com, 2010. Exclusively permitted copyright material. Duplication prohibited.

మరో ప్రపంచం,
మరో ప్రపంచం,
మరో ప్రపంచం పిలిచింది!
పదండి ముందుకు,
పదండి త్రోసుకు!
పోదాం, పోదాం పైపైకి!

కదం త్రొక్కుతూ,
పదం పాడుతూ,
హృదాంతరాళం గర్జిస్తూ-
పదండి పోదాం,
వినబడలేదా
మరో ప్రపంచపు జలపాతం?

దారిపొడుగునా గుండె
నెత్తురులు
తర్పణ చేస్తూ
పదండి ముందుకు!
బాటలు నడచీ,
పేటలు కడచీ,
కోటలన్నిటిని దాటండి!
నదీ నదాలూ,
అడవులు, కొండలు,
ఎడారులా మన కడ్డంకి?
పదండి ముందుకు!
పదండి త్రోసుకు!
పోదాం, పోదాం, పైపైకి!

ఎముకలు కుళ్ళిన,
వయస్సు మళ్ళిన
సోమరులారా! చావండి!
నెత్తురు మండే,
శక్తులు నిండే,
సైనికులారా! రారండి!
"హరోం! హరోం హర!
హర! హర! హర! హర!
హరోం హరా!" అని కదలండి!

మరో ప్రపంచం,
మహా ప్రపంచం
ధరిత్రినిండా నిండింది!
పదండి ముందుకు,
పదండి త్రోసుకు!
ప్రభంజనం వలె హోరెత్తండీ!
భావ వేగమున ప్రసరించండీ!
వర్షుకాభ్రముల
ప్రళయఘోషవలె
పెళ పెళ పెళ పెళ
విరుచుకు పడండి!

పదండి,
పదండి,
పదండి ముందుకు!
కనబడలేదా మరో ప్రపంచపు
కణకణమండే త్రేతాగ్ని?

ఎగిరి, ఎగిరి, ఎగిరి పడుతున్నవి
ఎనభై లక్షల మేరువులు!
తిరిగి, తిరిగి, తిరిగి సముద్రాల్
జలప్రళయ నాట్యం చేస్తున్నవి!
సలసల కాగే చమురా? కాదిది
ఉష్ణరక్త కాసారం!
శివసముద్రమూ,
నయాగరావలె
ఉరకండీ! ఉరకండీ ముందుకు!
పదండి ముందుకు!
పదండి త్రోసుకు!
మరో ప్రపంచపు కంచు నగారా
విరామ మెరుగక మ్రోగింది!

త్రాచులవలెనూ,
రేచులవలెనూ,
ధనంజయునిలా సాగండి!
కనబడలేదా మరో ప్రపంచపు
అగ్నికిరీటపు ధగధగలు,
ఎర్రబావుటా నిగనిగలు,
హోమజ్వాలల భుగభుగలు?

(12-4-1934)

Property of www.eemaata.com, 2010. Exclusively permitted copyright material. Duplication prohibited.




కుక్కపిల్లా,
అగ్గిపుల్లా,
సబ్బుబిళ్లా-

హీనంగా చూడకు దేన్నీ!
కవితామయమేనోయ్ అన్నీ!

రొట్టెముక్కా,
అరటితొక్కా,
బల్లచెక్కా-

నీవైపే చూస్తూ ఉంటాయ్!
తమ లోతు కనుక్కోమంటాయ్!

తలుపుగొళ్లెం,
హారతిపళ్లెం,
గుర్రపుకళ్లెం-

కాదేదీ కవిత కనర్హం!
ఔనౌను శిల్పమనర్ఘం!

ఉండాలోయ్ కవితావేశం!
కానీవోయ్ రస నిర్దేశం!
దొరకదటోయ్ శోభాలేశం!

కళ్లంటూ ఉంటే చూసి,
వాక్కుంటే వ్రాసీ!

ప్రపంచమొక పద్మవ్యూహం!
కవిత్వమొక తీరని దాహం!

(14-4-1934)

Property of www.eemaata.com, 2010. Exclusively permitted copyright material. Duplication prohibited.




కవితా! ఓ కవితా!
నా యువకాశల నవపేశల సుమగీతావరణంలో
నిను నే నొక సుముహూర్తంలో,
అతి సుందర సుస్పందనమందున
దూరంగా వినువీథుల్లో విహరించే
అందని అందానివిగా
భావించిన రోజులలో,
నీకై బ్రతుకే ఒక తపమై
వెదుకాడే నిమిషాలందు విషాలందున,
ఎటు నే చూచిన చటులాలంకారపు
మటుమాయల నటనలలో
నీ రూపం కనరానందున,
నా గుహలో, కుటిలో, చీకటిలో
ఒక్కడనై స్రుక్కిన రోజులు లేవా?

నీ ప్రాబల్యంలో,
చిరదీక్షా శిక్షా తపస్సమీక్షణలో,
నిశ్చల సమాధిలో,
సర్గద్వారపు తోరణమై వ్రేలిన నా
మస్తిష్కంలో
ఏయే ఘోషలు, భాషలు, దృశ్యాల్ తోచాయో?
నే నేయే చిత్ర విచిత్ర శ్రమంత

Property of www.eemaata.com, 2010. Exclusively permitted copyright material. Duplication prohibited.

రోచష్ణవహం చూశానో!
నా గీతం ఏయే శక్తులలో
ప్రాణస్పందన పొందిందో?
నీకై నే నేరిన వేయే ధ్వనులో,
ఏయే మూలలు వెదికిన పాశ్రవులు
పాశ్రవుల రణన్నినాదాలో:

నడిరే యాకస మావర్తించిన,
మేఘూ లావర్షించిన,
ప్రచండ ఝంఝూ ప్రభంజనం
గజగజ లాడించిన
నడిసంద్రపు కెరటాల్లో మ్రోగిన
శంఖారావం, ఢంకాధ్వానం:

ఆ రాత్రి,
కారడవులలో బయాతీతమై
విరుతించిన నానాజంతుధ్వనులో?
నక్షత్రాంతర్నిబిడ నిఖిలగానం,
భూకంపాలు, ప్రభుత్వ పతనాలు,
విప్లవం, యుద్ధం,
అన్నీ నీ చైతన్యం!
నీ విశ్వరూప సాక్షాత్కారం

మరి నిన్ను స్మరిస్తే
నా కగుపించే దృశ్యాలా?
వినిపించే భాష్యాలా?
అగ్ని సరస్సున వికసించిన వజ్రం!
ఎగిరే లోహా శ్యేనం!
ఫిరంగిలో జ్వరం ధ్వనించే మృదంగ నాదం

ఇంకా నేనేం విన్నానా?
నడిరే నిద్దురలో
అపుడే ప్రసవించిన శిశువు నెడద నిడుకొని
రుచిర స్వప్నాలను కాంచే
జవరాలి మనఃప్రపంచపు టావర్తాలు!
శిశువు చిత్ర నిద్రలో
ప్రాచీన స్మృతు లూచే చప్పుడు!

వైద్యశాలలో,
శస్త్రకారుని మహేంద్రజాలంలో,
చావుబ్రతుకుల సంధ్యాకాలంలో
కన్నుయుమూసిన రోగార్తుని
రక్తనాళ సంస్పందన!
కాయిన నీళులలో జారిపడి
కదలగ నైనా చాలని



తాగుబోతు వ్యక్తావ్యక్తాలాపన!
ప్రేలాపన!

కడుపు దహించుకుపోయే
పడుపుకత్తె రాక్షసరతిలో
అర్ధనిమీలిత నేత్రాల
భయంకర బాధల పాటల పల్లవి!
ఉరితీయబడ్డ శిరస్సు చెప్పిన రహస్యం!
ఉన్మాది మనస్సినీవాలిలో
ఘూకంకేకా, భేకంబాకా!
సమ్మెకట్టిన కూలీలు,
సమ్మెకట్టిన కూలీల భార్యలు, బిడ్డల
ఆకటి చీకటి చిచ్చుల
హాహాకారం! ఆర్తారావం!

ఒక లక్ష నక్షత్రాల మాటలు,
ఒక కోటి జలపాతాల పాటలు,
శతకోటి సముద్ర తరంగాల మ్రోతలు!
విన్నానమ్మా! విన్నా నెన్నో విన్నాను.
నా విన్నవి కన్నవి విన్నవించగా
మాటలకై వెదుకాడగబోతే-
అవి,

పుంఖానుపుంఖంగా
శ్మశానాలవంటి నిఘంటువుల దాటి,
వ్యాకరణాల సంకెళ్ళ విడిచి,
ఛందస్సుల సర్పపరిష్వంగం వదలి-
వడిగా, వడివడిగా
వెలువడినై, పరుగిడినై, నా యెదనడుగిడినై!

ఆ చెలరేగిన కలగాపులగపు
విలయావర్తపు
బలవత్ ఝరావత్ పరివర్తనలో,
నే నేయే వీధులలో
చంక్రమణం చేశానో,
నా సృష్టించిన గానంలో
ప్రక్షాళిత మామక పాపపరంపర
లానంద వశంవద హృదయుని జేస్తే-
నీకై మేలుకొనిన
సకలేంద్రియములతో
ఏది రచిస్తున్నానో, చూస్తున్నానో,
వూపిరి తీస్తున్నానో
నిర్వికల్ప సమాధిలో
నా ప్రాణం నిర్వాణం పొందిందో,
అటు నను మంత్రించిన,

సమ్ముగ్ధంగావించిన ఆ గాంధర్వానికి,
తారానివహపు ప్రేమసమాగమంలో
జన్మించిన సంగీతానికి...
నా నాడుల తీగలపై సాగిన
నాద బ్రహ్మపు పరిచుంబనలో,
ప్రాణావసాన వేళాజనితం,
నానాగానానూనస్వానావళితం,
బ్రతుకును ప్రచండభేరుండ గరు
త్పరిరంభంలో పట్టిన గానం,
సుఖదుఃఖాదిక ద్వంద్వాతీతం,
అమోఘ, మగాధ, మచింత్య, మమేయం,
ఏకాంతం, ఏకైకం,
క్షణికమ్మై శాశ్వతమ్మైన దివ్యానుభవం,
బ్రహ్మానుభవం కలిగించిన,
నను కరిగించిన కవనఘృణీ!
రమణీ!
కవితా! ఓ కవితా!

నా జనని గర్భంలో,
ఆకారం లేకుండా నిద్రిస్తున్న
నా అహంకారానికి
ఆకలి గొల్పించిన నాడో!

Property of www.eemaata.com, 2010. Exclusively permitted copyright material. Duplication prohibited.



నా బహిరంత రింద్రియాలలో
ప్రాణం ప్రసరించగ, నేనీ భూలోకంలో పడి
సుఖదుఃఖా రేకో
వస్తూంటే తలదాలిచి
ప్రపంచ పరిణాహంలో
ప్రయాణికుడనై,
పరివ్రాజకుడనై,
విహ్వలంగా వర్తించేవేళ
అభయహస్త ముద్రతో నను దరిసిన
నన్ను పునీతుని కావించిన కవితా!
లలిత లలిత కరుణామహితా!
అనుపమితా!
అపరిమితా!
కవితా! ఓ కవితా

నేడో నా హృదంచుల
సాహసికాంశం కప్పిన నా
నిట్టూర్పులు వినిపిస్తాయా?
నే నేడో విరచిస్తానని,
నా రచనలలో లోకం ప్రతిఫలించి,
నా తపస్సు ఫలించి,
నా గీతం గుండెలలో ఘూర్ణిల్లగ
నా జాతి జనులు పాడుకొనే
మంత్రంగా మోగించాలని
నా ఆకాశాలను
లోకానికి చేరువగా,
నా ఆదర్శాలను
సోదరులంతా పంచుకునే
వెలుగుల రవ్వల జడిగా,
అందీ అందకపోయే
నీ చేలాంచలము విసరుల
కొసగాలులలో నిర్మించిన
నా నుడి నీ గుడిగా,
నా గీతం నైవేద్యంగా, హృద్యంగా,
అర్పిస్తానో
నా విసరిన రస విన్యమర
కుసుమ పరాగం!
ఓహో! ఓ రసధుని! మణిఖని!
జననీ! ఓ కవితా!
కవితా! కవితా! ఓ కవితా!

(1937 ?)

Property of www.eemaata.com, 2010. Exclusively permitted copyright material. Duplication prohibited.

మాయంటావా? అంతా
మిథ్యంటావా?
నా ముద్దుల వేదాంతీ!
ఏమంటావు?
మాయంటావ్రా? లోకం
మిథ్యంటావ్రా?
కనబడినది కనబడదని
వినబడినది వినబడదని

జగతి మరపు, స్వప్నం, ని
శ్శబ్దం ఇది
మాయ! మాయ!
మాయంటావ్రా? అంతా
మిథ్యంటావ్రా?

జమీందారు రోల్సుకారు
మాయంటావు? బాబూ
ఏమంటావు?
మహారాజ మనీపర్సు
మాయంటావ్రా? స్వామీ
ఏమంటావ్రా?
మరఫిరంగి, విషవాయువు
మాయంటావ్రా? ఏం,
ఏమంటావు?

పాలికాపు నుదుటి చెమట,
కూలివాని గుండె చెరువు
బిచ్చగాని కడుపు కరువు
మాయంటావు?
తుపానులూ, భూకంపం,
తిరుగుబాట్లు, సంగ్రామం,
సంగ్రామం, సంగ్రామం,
మాయంటావ్రా? ఏయ్
ఏమంటావు?

జగతి మరపు, స్వప్నం, ని
శ్శబ్దం, ఇది
మాయ! మాయ!
మాయ! మాయ!
మాయ! మాయ!
మాయంటావ్రా? అంతా
మిథ్యంటావ్రా?

(1937)




Property of www.eemaata.com, 2010. Exclusively permitted copyright material. Duplication prohibited.

# అవతారం




యముని మహిషపు లోహ ఘంటలు
మబ్బుచాటున
ఖణేల్ మన్నాయి!
నరకలోకపు జాగిలమ్ములు
గొలుసు త్రెంచుకు
ఉరికిపడ్డాయి!
ఉదయ సూర్యుని సప్తహయములు
నురుగులెత్తే
పరుగు పెట్టేయి!

కనకదుర్గా చండసింహం జూలు దులిపీ, ఆవులించింది!
ఇంద్రదేవుని మదపుటేనుగు ఘీంకరిస్తూ, సవాల్‌చేసింది!

నందికేశుడు
రంకెవేస్తూ,
గంగడోలును కదిపిగెంతేడు!
ఆదిసూకర
వేదవేద్యుడు
ఘుర్ఘురిస్తూ, కోరసాచాడు!
పుడమి తల్లికి
పురుటినొప్పులు
కొత్త సృష్టిని స్ఫురింపించాయి!

(14-4-1934)

Property of www.eemaata.com, 2010. Exclusively permitted copyright material. Duplication prohibited.




పొలాలనన్నీ
హలాలదున్నీ
ఇలాతలంలో హేమం పిండగ-
జగానికంతా సౌఖ్యం నిండగ-
విరామమెరుగక పరిశ్రమించే,
బలం ధరిత్రికి బలికావించే,
కర్షక వీరుల కాయం నిండా
కాలువకట్టే ఘర్మజలానికి,
ఘర్మజలానికి,
ధర్మజలానికి,
ఘర్మజలానికి ఖరీదు లేదోయ్!

నరాల బిగువూ,
కరాల సత్తువ
వరాలవర్షం కురిపించాలని,
ప్రపంచభాగ్యం వర్ధిల్లాలని-
గనిలో, వనిలో, కార్ఖానాలో
పరిక్లమిస్తూ,
పరిప్లవిస్తూ,
ధనిక స్వామికి దాస్యం చేసే,
యంత్రభూతముల కోరలు తోమే,
కార్మిక వీరుల కన్నుల నిండా
కణకణమండే,
గలగల తొణకే
విలాపాగ్నులకు, విషాదాశ్రులకు
ఖరీదు కట్టే షరాబు లేడోయ్!

నిరపరాధులై దురదృష్టంచే
చెరసాలలో చిక్కేవాళ్లూ-
లోహ రాక్షసుల పదఘట్టనచే
కొనప్రాణంతో కనలేవాళ్లూ-
కష్టం చాలక కడుపుమంటలే
తెగించి సమ్మెలు కట్టేవాళ్లూ-
శ్రమ నిష్ఫలమై,
జని నిష్ఠురమై,
నూతిని గోతిని వెదకేవాళ్లూ-

అనేకులింకా అభాగ్యులంతా,
అనాథులంతా,
అశాంతులంతా
దీర్ఘశ్రుతిలో, తీవ్రధ్వనితో
విప్లవశంఖం వినిపిస్తారోయ్!

Property of www.eemaata.com, 2010. Exclusively permitted copyright material. Duplication prohibited.

కావున- లోకపుటన్యాయాలూ,
కాల్చే ఆకలి, కూల్చే వేదన,
దారిద్ర్యాలూ, దౌర్జన్యాలూ
పరిష్కరించే, బహిష్కరించే
బాటలు తీస్తూ,
పాటలు వ్రాస్తూ,

నాలో కదిలే నవ్యకవిత్వం
కార్మికలోకపు కళ్యాణానికి,
శ్రామిక లోకపు సౌభాగ్యానికి
సమర్పణంగా
సమర్చనంగా-
త్రిలోకాలలో
త్రికాలాలలో,
శ్రమైక జీవన సౌందర్యానికి
సమానమైనది లేనేలేదని

కష్టజీవులకు
కర్మవీరులకు
నిత్యమంగళం నిర్దేశిస్తూ,
స్వస్తివాక్యములు సంధానిస్తూ,
స్వర్ణ వాద్యములు సంరావిస్తూ

వ్యథార్త జీవిత యథార్థ దృశ్యం
పునాదిగా ఇక జనించబోయే
భావివేదముల జీవనాదములు
జగత్తుకంతా చవులిస్తానోయ్!

కమ్మరి కొలిమీ, కుమ్మరి చక్రం,
జాలరి పగ్గం,
సాలెల మగ్గం,
శరీరకష్టం స్ఫురింపజేసే
గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి,
సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు-

నా వినుతించే,
నా విరుతించే,
నా వినిపించే నవీన గీతికి,
నా విరచించే నవీన రీతికి,
భావం!
భాగ్యం!
ప్రాణం!
ప్రణవం.

(7-5-1937)

Property of www.eemaata.com, 2010. Exclusively permitted copyright material. Duplication prohibited.




ఆ సాయంత్రం
రాక్సీలో నార్మా షేరర్,
బ్రాడ్వేలో కాంచనమాల!
ఎటకేగుటో సమస్య కలిగిం
దొక విద్యార్థికి!

ఉడిపి శ్రీకృష్ణ విలాస్ లో--
అటు చూస్తే బాదం హల్వా,
ఇటు చూస్తే సేమ్యా ఇడ్లీ!
ఎంచుకొనే సమస్య కలిగిం
దొక ఉద్యోగికి!

ఆ సాయంత్రం
ఇటు చూస్తే అప్పుల వాళ్ళూ
అటు చూస్తే బిడ్డల ఆకలి!

ఉరి పోసుకు చనిపోవడమో,
సముద్రమున పడిపోవడమో-
సమస్యగా ఘనీభవించిందొక
సంసారికి!

(1939)

Property of www.eemaata.com, 2010. Exclusively permitted copyright material. Duplication prohibited.

# చేదుపాట



ఔను నిజం, ఔను నిజం
ఔను నిజం, నీవన్నది,
నీవన్నది, నీవన్నది,
నీవన్నది నిజం, నిజం!

లేదు సుఖం, లేదు సుఖం,
లేదు సుఖం జగత్తులో!
బ్రదుకు వృథా, చదువు వృథా,
కవిత వృథా! వృథా, వృథా!

మనమంతా బానిసలం,
గానుగలం, పీనుగలం!
వెనుక దగా, ముందు దగా,
కుడి యెడమల దగా, దగా!

మనదీ ఒక బతుకేనా?
కుక్కల వలె, నక్కల వలె!
మనదీ ఒక బతుకేనా?
సందులలో పందులవలె!

నిజం సుమీ, నిజం సుమీ,
నీవన్నది నిజం సుమీ!
బ్రతుకు ఛాయ, చదువు మాయ,
కవిత కరక్కాయ సుమీ!

లేదు సుఖం, లేదు రసం,
చేదు విషం జీవఫలం!
జీవఫలం చేదువిషం,
చేదు విషం, చేదు విషం!

ఔను నిజం, ఔను సుమా,
ఔను నిజం నీవన్నది!
నీవన్నది, నీవన్నది,
నీవన్నది నిజం, నిజం!

(14-5-1937)

Property of www.eemaata.com, 2010. Exclusively permitted copyright material. Duplication prohibited.

# నిజంగానే

నిజంగానే నిఖిలలోకం
నిండుహర్షం వహిస్తుందా?
మానవాళికి నిజంగానే
మంచికాలం రహిస్తుందా?

నిజంగానే, నిజంగానే
నిఖిలలోకం హసిస్తుందా?
దారుణ ద్వేషాన్ని పెంచే
దానవత్వం నశిస్తుందా?

బానిసల సంకెళ్ళు బిగిసే
పాడుకాలం లయిస్తుందా?
సాధుసత్వపు సోదరత్వపు
స్వాదుతత్వం జయిస్తుందా?

జడలు విచ్చిన, సుడులు రెచ్చిన
కడలినృత్యం శమిస్తుందా?
నడుము తడబడి, సడలి, ముడుగక
పడవతీరం క్రమిస్తుందా?

నిజంగానే, నిజంగానే?

(1941 ?)



Property of www.eemaata.com, 2010. Exclusively permitted copyright material. Duplication prohibited.




సిందూరం, రక్తచందనం,
బందూకం, సంధ్యారాగం,
పులిచంపిన లేడినెత్తురూ,
ఎగరేసిన ఎర్రనిజెండా,
రుద్రాలిక నయనజ్వాలిక,
కలకత్తా కాళిక నాలిక

కావాలోయ్ నవకవనానికి--

రాబందుల రెక్కల చప్పుడు,
పొగగొట్టపు భూంకార ధ్వని
అరణ్యమున హరీంద్ర గర్జన
పయోధర ప్రచండ ఘోషం
ఖడ్గమృగోదగ్రవిరావం,
ఝంఝానిల షడ్జధ్వానం

కావాలోయ్ నవకవనానికి--

ఘాటెక్కిన గంధక ధూమం,
పోటెత్తిన సప్త సముద్రాల్,
రగులుకొనే రాక్షసబొగ్గూ,
బుగులుకొనే బుక్కాగుండా,
వికసించిన విద్యుత్తేజం,
చెలరేగిన జనసమ్మర్దం

కావాలోయ్ నవకవనానికి--

కదిలేది కదిలించేదీ,
మారేది మార్పించేదీ,
పాడేదీ పాడించేదీ,
పెనునిద్దుర వదిలించేదీ,
మునుముందుకు సాగించేదీ,
పరిపూర్ణపు బ్రతుకిచ్చేదీ

కావాలోయ్ నవకవనానికి--

(3-8-1937)

Property of www.eemaata.com, 2010. Exclusively permitted copyright material. Duplication prohibited.




Property of www.eemaata.com, 2010. Exclusively permitted copyright material. Duplication prohibited.

నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధ నొక్కటి ఆహుతిచ్చాను!

నేను సైతం
విశ్వ వృష్టికి
అశ్రువొక్కటి ధారపోశాను!

నేను సైతం
భువన ఘోషకు
వెర్రి గొంతుక విచ్చి మ్రోశాను.

* * *

ఎండ కాలం మండినప్పుడు
గబ్బిలం వలె
క్రాగి పోలేదా!
వాన కాలం ముసిరి రాగా
నిలువు నిలువున
నీరు కాలేదా?
శీత కాలం కోత పెట్టగ
కొరడు కట్టీ
ఆకలేసీ కేక వేశానే!

* * *

నే నొక్కణ్ణే
నిల్చిపోతే-
చండ్ర గాడ్పులు, వాన మబ్బులు,
మంచు సోనలు
భూమి మీదా
భుగ్న మౌతాయి!

నింగినుండీ తొంగిచూసే
రంగు రంగుల చుక్కలన్నీ
రాలి, నెత్తురు క్రక్కుకుంటూ
పేలిపోతాయి!

పగళ్ళన్నీ పగిలిపోయీ,
నిశీథాలూ విశీర్ణిల్లీ,
మహా ప్రళయం జగం నిండా
ప్రగల్భిస్తుంది!

* * *

నే నొక్కణ్ణే ధాత్రినిండా
నిండిపోయీ,
నా కుహూరుత శీకరాలే
లోకమంతా జల్లులాడే
ఆ ముహూర్తా లాగమిస్తాయి!

* * *

నేను సైతం
ప్రపంచాబ్జపు
తెల్ల రేకై పల్లవిస్తాను!

నేను సైతం
విశ్వవీణకు
తంత్రినై మూర్ఛనలు పోతాను!

నేను సైతం
భువన భవనపు
బావుటానై పైకి లేస్తాను!

(2-6-1933)

Property of www.eemaata.com, 2010. Exclusively permitted copyright material. Duplication prohibited.

# జగన్నాథుని రథచక్రాలు



పతితులార!
భ్రష్టులార!
బాధాసర్ప దష్టులార!

బ్రదుకు కాలి,
పనికిమాలి,
శని దేవత రథచక్రపు
టిరుసులలో పడి నలిగిన
దీనులార!
హీనులార!
కూడు లేని, గూడు లేని
పక్షులార! భిక్షులార!
సఖులవలన పరిచ్యుతులు,
జనులవలన తిరస్కృతులు,
సంఘానికి బహిష్కృతులు--
జితాసువులు,

చ్యుతాశయులు,
హృతాశ్రయులు,
హతాశులై
ఏడవకం డేడవకండి!

మీ రక్తం, కలగి కలగి
మీ నాడులు కదలి కదలి
మీ ప్రేవులు కనలి కనలి
ఏడవకం డేడవకండి.

ఓ వ్యథానివిష్టులార!
ఓ కథావశిష్టులార!
పతితులార!
భ్రష్టులార!
బాధాసర్పదష్టులార!
ఏడవకం డేడవకండి!

వస్తున్నా యొస్తున్నాయి...
జగన్నాథ,
జగన్నాథ,
జగన్నాథ రథచక్రాల్!
జగన్నాథుని రథచక్రాల్!
రథచక్రాల్,
రథచక్రాల్,
రథచక్రాల్, రథచక్రా
లొస్తున్నా యొస్తున్నాయి !

Property of www.eemaata.com, 2010. Exclusively permitted copyright material. Duplication prohibited.

పతితులార!
భ్రష్టులార!
మొయిల్దారిని
బయల్దేరిన
రథచక్రాల్, రథచక్రా
లొస్తున్నా యొస్తున్నాయి!

సింహాచలం కదిలింది,
హిమాలయం కరిగింది,
వింధ్యాచలం పగిలింది--
సింహాచలం,
హిమాచలం,

వింధ్యాచలం, సంధ్యాచలం...
మహానగా లెగురుతున్నాయి !
మహారథం కదులుతున్నది !
చూర్ణమాన, ఘూర్ణమాన
దీర్ణమాన గిరిశిఖరాల్
గిరగిరగిర తిరుగుతున్నాయి !
పతితులార! భ్రష్టులార!
బాధాసర్పదష్టులార !
రారండో! రండో! రండి!

ఊరవతల నీరింకిన
చెరువుపక్క, చెట్టునీడ--
గోనెలతో, కుండలతో,
ఎటుచూస్తే అటు చీకటి,
అటు దుఃఖం, పటునిరాశ--
చెరసాలలు, ఉరికొయ్యలు,
కాలువలో ఆత్మహత్య!
దగాపడిన తమ్ములార!
మీ బాధలు నే నెరుగుదును...
వడలో, కడు
జడిలో, పెను
చలిలో తెగనవసి కుములు
మీ బాధలు, మీ గాథలు
అవగాహన నాకవుతాయి
పతితులార! భ్రష్టులార!
దగాపడిన తమ్ములార!
మీ కోసం కలం పట్టి,
ఆకాశపు దారులంట
అడావుడిగ వెళిపోయే,
అరుచుకుంటు వెళిపోయే
జగన్నాథుని రథచక్రాల్,
రథచక్ర ప్రళయఘోష
భూమార్గం పట్టిస్తాను!

నట ధూర్జటి
నిటాలాక్షి పగిలిందట!
నిటాలాగ్ని రగిలిందట!
నిటాలాగ్ని!
నిటాలార్చి!
నిటాలాక్షి పటాలుమని
ప్రపంచాన్ని భయపెట్టింది!
అరె ఝూః! ఝూః!
ఝుటక్, ఫటక్ ...

హింసనచణ
ధ్వంసరచన
ధ్వంసనచణ
హింసరచన
విషవాయువు, మరఫిరంగి,
టార్పీడో, టోర్నడో!
అది విలయం,
అది సమరం,
అటో యిటో తెగిపోతుంది!

సంరంభం,
సంక్షోభం,
సమ్మర్దన, సంఘర్షణ!

Property of www.eemaata.com, 2010. Exclusively permitted copyright material. Duplication prohibited.

హాలహలం పొంగ చూరింది!
కోలాహలం చెలరేగింది!
పతితులార! భ్రష్టులార!
ఇది సవనం, ఇది సమరం!

ఈ యెగిరిన ఇనుప డేగ,
ఈ పండిన మంట పంట,
ద్రోహాలను తూలగొట్టి,
గోషాలను తుడిచిపెట్టి,
స్వాతంత్ర్యం,
సమభావం,
సౌభ్రాతం,
సౌహార్ద్రం
పునాదులై ఇళ్లు లేచి,
జనావళికి శుభం పూచి--
శాంతి, శాంతి, శాంతి, శాంతి
జగమంతా జయిస్తుంది,
ఈ స్వప్నం నిజమవుతుంది!
ఈ స్వర్గం ఋజువవుతుంది!

పతితులార!
భ్రష్టులార!
బాధాసర్పదష్టులార!
దగాపడిన తమ్ములార!
ఏడవకం డేడవకండి!
వచ్చేశాయ్, విచ్చేశాయ్,
జగన్నాథ,
జగన్నాథ,
జగన్నాథ రథచక్రాల్,
జగన్నాథుని రథచక్రాల్
రథచక్రాల్,
రథచక్రాల్,
రథచక్రాల్, రథచక్రాల్,
రారండో! రండో! రండో!
ఈ లోకం మీదేనండి!
మీ రాజ్యం మీరేలండి!



Property of www.eemaata.com, 2010. Exclusively permitted copyright material. Duplication prohibited.